క్లుప్తంగా

హైకోర్టు ఏర్పాటుపై ప్రధాని ప్రకటన చేయాలి


మాట్లాడుతున్న సింగరాజు లక్ష్మణ్

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో హైకోర్టు ఏర్పాటుపై ప్రధాని నరేంద్రమోదీ స్పష్టత ఇవ్వాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సింగరాజు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 16వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ కర్నూలుకు వస్తున్న నేపథ్యంలో జిల్లాలో హైకోర్టు ఏర్పాటుపై ప్రకటన చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటనలు చేయడం తప్పా ఆచరణలో ఎలాంటి పురోగతి లేదన్నారు. న్యాయవాదులు సామ్సన్, ఆనంద్ పాల్గొన్నారు.

16న అంతర్జాతీయ చెస్ పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని కె.వి.సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రాజవర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 16, 17 తేదీల్లో అంతర్జాతీయ చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ నాయక్ ఇమామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఫిడే సంస్థ, అఖిల భారత చదరంగం క్రీడా సంస్థ, కర్నూలు జిల్లా చదరంగం, ఐకాన్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో గ్రాండ్ మాస్టర్ ఫిడే మాస్టర్, కాండిడేట్ మాస్టర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. విజేతలకు రూ.3 లక్షల నగదు బహుమతి, 200 మందికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు


రెండు స్వర్ణాలు సాధించిన మొగిలి వెంకట రామిరెడ్డి

కర్నూలు టౌన్: ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన 40వ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు జిల్లా నందవరం మండలం హాలహర్వికి చెందిన మొగలి వెంకటరామిరెడ్డి బంగారు పతకాలు సాధించారు. అండర్–20 విభాగంలో 800 మీటర్లు, 1500 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ఈ ఘనత సాధించాడని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ హర్షవర్ధన్, కార్యదర్శి సుబ్బరత్నాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగారు పతకాలు సాధించిన అథ్లెట్‌కు పలువురు క్రీడాభిమానులు అభినందనలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

కర్నూలు టౌన్: రోలర్ స్కేటింగ్ పోటీల్లో మాంటే విద్యార్థులు సోమా శశాంక్ ఆర్య, ఇషితాలు రింక్, రోడ్డు రేసు పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన స్కేటర్లను మంగళవారం పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ తబస్సు అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. వచ్చే నెల 1న కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలన్నారు. జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం సీఈఓ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

కోలుకోలేక గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: కర్నూలు మండలం ఉల్చాల గ్రామం వైపు వెళ్లే రోడ్డులో ఆదిత్య నగర్ సమీపాన రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో పడి ఉండగా స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. బాధితుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి వయస్సు దాదాపు 50 ఏళ్లు ఉంటుంది. చామన చాయ వర్ణంలో ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసినవారు 94412 90736 లేదా 91211 01062 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ విక్రమ సింహా విజ్ఞప్తి చేశారు.

మహిళ నేత్రదానం

కర్నూలు (హాస్పిటల్): మరణానంతరం ఓ మహిళ నేత్రాలను కుటుంబ సభ్యులు మంగళవారం దానం చేశారు. కర్నూలు నగరానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రూపనగుడి నీలవేణి (76) అనారోగ్యంతో మరణించారు. నేత్రదానం గురించి మానవతా సంస్థ సభ్యులు ఆ కుటుంబ సభ్యులను సంప్రదించగా మానవత్వంతో వారు అంగీకారం తెలిపారు. మానవతా కన్వీనర్లు యాని ప్రతాప్, అపర్ణ, శోభన్ బాబు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(అర్బన్): మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రైనింగ్ కొరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ట్రైనింగ్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదురు పద్మాకర్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో నవంబర్ 15వ తేదీన సెలక్షన్ జాబితాను ప్రచురిస్తారని, 21వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలో చంద్రబాబు దిట్ట

- నకిలీ మద్యం రాష్ట్ర వ్యాప్తంగా ఏరులై పారుతోంది
- నకిలీ మద్యంపై సీబీఐ విచారణ చేయాలి
- విలేకరుల సమావేశంలో నగర మేయర్ బీవై రామయ్య


మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కల్లూరు: డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిట్ట అని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులైపారుతోందని, రాష్ట్రం మద్యాంధ్రప్రదేశ్‌గా మారిందని విమర్శించారు. మంగళవారం గణేష్ నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏరులై పారుతున్న నకిలీ మద్యంపై చంద్రబాబు నాయుడు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం కేసును కూటమి ప్రభుత్వం, చంద్రబాబు డైవర్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పజెప్పి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. 2024 ఎన్నికల్లో తంబళ్లపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయచంద్రారెడ్డికి నకిలీ మద్యం నిందితుడు జనార్దన్‌రావు అత్యంత సన్నిహితుడనే విషయం అందరికి తెలుసన్నారు. నకిలీ మద్యం రాకెట్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంటకట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జనార్దన్‌రావును పావుగా చేసుకొని వైఎస్సార్‌సీపీపై బురద చల్లుతున్నారన్నారు.

సిట్ పేరుతో సాక్షులతో కట్టు కథలు..

సీబీఐ విచారణ కాలయాపన చేస్తారనే సాకుతో చంద్రబాబు సిట్ పేరుతో సాక్షులను ప్రభావితం చేస్తున్నారని మేయర్ ఆరోపించారు. సిట్ పేరుతో జ్యుడిషియల్, పోలీస్ సమక్షంలో జనార్దన్‌రావుతో కట్టు కథను అల్లుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి జోగి రమేష్‌కి అంటగట్టేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారన్నారు. నకిలీ మద్యం కేసును సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. నిజాలను వెలికి తీసుకువస్తున్న సాక్షి మీడియాపై అక్రమ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. సాక్షి టీవీ, పేపర్‌పై అక్రమ కేసులు నమోదు చేసి భయపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారన్నారు.

నేటి మధ్యాహ్నంలోపు ఏర్పాట్లు పూర్తి చేయాలి


సమావేశమైన టీడీపీ, బీజేపీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ బుధవారం మధ్యాహ్నానికి పూర్తి చేయాలని మంత్రి అచ్చెంన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం నన్నూరు సమీపంలోని రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో పీఎం సభ ఏర్పాట్లను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంన్నాయుడు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరిశీలించారు. పటిష్టమైన భద్రతతోపాటు సభకు వచ్చే వారికి నీళ్లు, భోజనం, వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ ఏర్పాట్లను పరిశీలించారు. మరోవైపు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రధాని సభ ఏర్పాట్లపై ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వీరపాండియన్ సమీక్షించారు.

రెండు తాత్కాలిక ఆసుపత్రుల ఏర్పాటు

కర్నూలు (హాస్పిటల్): ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను పురస్కరించుకుని జీఎస్టీ సభ ప్రాంగణం వద్ద రెండు తాత్కాలిక ఆసుపత్రులు ఏర్పాటు చేసినట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రముఖులకు 10 పడకల ఆసుపత్రి, సామాన్య ప్రజలకు 20 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేశామని, రోగులను ఆసుపత్రికి తరలించేందుకు వీలుగా 15 పార్కింగ్ ప్రదేశాల్లో 108, 104 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల తదితరులు ఉన్నారు.

భద్రత ఏర్పాట్లపై హోం మంత్రి సమీక్ష

కర్నూలు: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16న కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కర్నూలు చేరుకుని భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. నన్నూరు రాగమయూరి గ్రీన్‌హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన కమాండెంట్ కంట్రోల్ రూమ్‌లో మంగళవారం సాయంత్రం మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి పోలీసు అధికారులతో మాట్లాడారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, క్రమబద్ధంగా సమన్వయంతో సాగాలని అధికారులను ఆదేశించారు. భద్రత వ్యవస్థల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, కమ్యూనికేషన్ సౌకర్యాలు, ప్రజా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. డీఐజీ సత్య ఏసుబాబు, డీఎస్పీ భావన తదితరులతో మంత్రి మాట్లాడి భద్రత ఏర్పాట్ల గురించి ఆరా తీశారు.

జీఎస్టీతో ప్రజలకు ఊరట


సభా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, తదితరులు

కర్నూలు కల్చరల్: జీఎస్టీ సరళింపు పేద మధ్య తరగతి వారికి చిన్న పరిశ్రమలకు పెద్ద ఎత్తున ఊరటనిచ్చే విధంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. మాధవ్ ఆధ్వర్యంలో బీజేపీ ప్రతినిధుల బృందం మంగళవారం నన్నూరు టోల్ గేట్ సమీపంలోని సభా ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్, టీజీ వెంకటేష్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

కర్నూలు కల్చరల్: ప్రధాని మోదీ పర్యటనతో జిల్లాకు కొత్త పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని బీజేపీ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం కర్నూలులో ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ డిక్లరేషన్ అమలు దిశగా బీజేపీ వెళ్తోందన్నారు. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. ప్రజల సహకారంతో మోదీ సభను జయప్రదం చేస్తామన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఐ.విజయకుమార్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర నాయకులు విట్టా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ – నీవాతో రాయలసీమకు జలసిరి

కర్నూలు(సెంట్రల్): హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు జలసిరి పట్టిందని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలోని 517 చెరువులకుగాను 299 చెరువులను కృష్ణా జలాలతో నింపినట్లు చెప్పారు. సకాలంలో పనులు పూర్తి చేయడానికి కృషి చేసిన అధికారులను అభినందిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఇరిగేషన్ కార్యాలయంలో మంత్రి ఇంజినీర్లతో సమీక్షించారు. కర్నూలు నుంచి చిత్తూరు, కుప్పం వరకు నీటిని తీసుకెళ్లడంలో ఇంజినీర్ల పాత్ర ఎంతో ఉందన్నారు. మరోవైపు రాష్ట్రంలోని 961 రిజర్వాయర్లను 844 టీఎంసీలతో నింపామని అంటే 87.86 శాతం నీటి నిల్వలు ఉన్నట్లు వివరించారు. సమీక్షలో ఇరిగేషన్ అడ్వైజరీ వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ప్రాజెక్టు సీఈలు కబీర్‌బాషా, నాగరాజు పాల్గొన్నారు.

'మోదీ గో బ్యాక్'ను జయప్రదం చేయాలి

కర్నూలు(సెంట్రల్): సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్నూలుకు వస్తున్న పీఎం పర్యటనను నిరసిస్తూ బుధవారం చేపట్టే నరేంద్రమోదీ గో బ్యాక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ న్యూసిటీ అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, నరసింహులు, నగర ఉపాధ్యక్షుడు టి.రాముడు, కోశాధికారి సాయిబాబా పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ నాయకులు కార్మిక అడ్డాల్లో మోదీ గో బ్యాక్ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. 11 ఏళ్లపాటు ప్రజలపై జీఎస్టీ భారం విధించి ఇప్పుడు కాస్త తగ్గించి సంబరాలు చేసుకోవడం అన్యాయమన్నారు.

ఉద్యోగులపై చిన్నచూపు తగదు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించడంపై దృష్టి సారించాలని ఏపీ ఎన్‌జీఓ అసోషియేషన్ కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు పూర్తయ్యిందని, ఈ కాలంలో ఉద్యోగులకు రూ.7 వేల కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. మంగళవారం కర్నూలు ఏడీఏ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కర్నూలు నగర శాఖ కార్యవర్గ సమావేశం సందర్భంగా తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. నగర శాఖ అధ్యక్షుడు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో వెంటనే రెండు విడుదల చేయాలని కోరారు. 12వ వేతన సవరణకు చర్యలు చేపట్టాలని, అత్యవసరంగా మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. మెడికల్ రీఎంబర్స్‌మెంటు బిల్లులు మంజూరు చేయాలని, మూడు విడతల సరెండర్ లీవ్ బిల్లులు, ఏపీజీఎల్ఐ బకాయిలు విడుదల చేయాలని కోరారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కేసీహెచ్ కృష్ణుడు, నగర శాఖ కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ సమస్యలపై ప్రధానితో చర్చించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యలపై ప్రధాని మోదీతో చర్చించాలని, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించేలా చూడాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి (ఆర్‌వీపీఎస్) రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాదాసి కురువ సుంకన్న కోరారు. మంగళవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ బస్తిపాటి నాగరాజుకు విన్నవించి కరపత్రం అందజేశారు.

వాల్మీకుల ఆకాంక్ష నెరవేర్చాలి

కర్నూలు(అర్బన్): వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలనే చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని జాతీయ వాల్మీకి ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు బుర్రా ఈశ్వరయ్య కోరారు. గతంలో కర్నూలుకు వచ్చిన సందర్భంలో వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తామని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీని తిరిగి కర్నూలు గడ్డపైనే అమలు చేయాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

విజయవంతం చేద్దాం

కర్నూలు (అగ్రికల్చర్): ప్రధాని మోదీ జిల్లా పర్యటనను విజయవంతం చేసేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు తరలిరావాలని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి జవహర్ లాల్, జిల్లా నాయకులు సాంబ శివారెడ్డి, రమణ, పి.రామకృష్ణారెడ్డి, వ్యవసాయ ఉద్యోగుల సంఘం నాయకుడు శ్రీనివాసులు, వెటర్నరీ పారా ఉద్యోగుల సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

తైక్వాండో పోటీలకు ఎంపిక

కర్నూలు టౌన్: ఏలూరులో ఈనెల 25న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు సెయింట్ జోసఫ్ విద్యార్థినులు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ వై.ఇన్నమ్మ, ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. మంగళవారం కళాశాలలో క్రీడాకారిణులను అభినందించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థినులు మహేశ్వరి, మేఘన, ఉషారాణి, హారిక, మాజీతా మెహరూన్, ఇంద్రాణి, సింధు మీనన్, రహీమా, ఆలీషాఉశేన్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు.

జీఎస్టీ సంస్కరణలతో దేశాభివృద్ధికి ఊతం


మోహన్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఆర్‌యూ వీసీ, తదితరులు

కర్నూలు కల్చరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలు దేశ పురోగతికి ఊతమిస్తాయని రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.వెంకట బసవరావు అన్నారు. మంగళవారం వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో ఎస్ఎస్ఎస్, కామర్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' అవగాహన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాధ్యత కలిగిన పౌరులుగా దేశంలో అమలవుతున్న వివిధ సంస్కరణల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఇ.మోహన్ గౌడ్ మాట్లాడుతూ..ప్రజలు రోజువారీ వినియోగించే వస్తువులపై పన్ను తగ్గించడం దేశ పురోగతికి సహకరిస్తుందన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. మోహన్ గౌడ్‌ను వీసీ, రెక్టార్ సన్మానించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌యూసీఈలో వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం


ఆర్‌యూ వీసీకి మొక్కను అందజేస్తున్న కటికె గౌతమ్, తదితరులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికె గౌతమ్ విమర్శించారు. మంగళవారం వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్‌కుమార్ నాయుడులను మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలను వారితో ప్రస్తావించారు. వర్సిటీలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంజినీరింగ్ కళాశాలకు నిధులు, నియామకాలతో నాణ్యమైన విద్యను అందించారన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి కొత్త కోర్సులను ప్రవేశ పెడితే ప్రస్తుతం ల్యాబ్‌లు, టీచింగ్ ఫ్యాకల్టీని ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. సంవత్సరం కావస్తున్నా రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించుకోలేక పోవడం విచారకరమన్నారు. పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీ, మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘం నాయకులు తిరుమలేష్, ఏజెస్, హుస్సేన్, గార్గేయపురం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బైరెడ్డి కోటిరెడ్డి, కర్నూలు మండల ప్రచార విభాగం అధ్యక్షుడు పల్లె నాగిరెడ్డి, సోషల్ మీడియా విభాగం కార్యదర్శి గడ్డం శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల సాహిత్య పురస్కారం ప్రదానం


పురస్కారం అందుకుంటున్న పుల్లా రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: సి.బెళగల్ మండలం పోలకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ బాల సాహితీవేత్త పుల్లా రామాంజనేయులు సింహప్రసాద్ సాహిత్య సమితి వారి డాక్టర్ వేదగిరి రాంబాబు బాల సాహిత్య పురస్కారం –2025ను అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం పూర్వ సలహాదారు కె.వి.రమణాచారి, సమితి కన్వీనర్ సింహప్రసాద్, సభ్యులు కథా రచయితలు విహారి, వాణిశ్రీ, సుధామ ప్రదానం చేశారు.. పురస్కారం కింద రూ.5 వేలు నగదు, మెమెంటోను అందజేసి ఘనంగా సత్కరించారు. ఏటా బాల సాహిత్యంలో విశేష కృషి చేసిన వారికి పురస్కారం అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పురస్కారం అందుకున్న రామాంజనేయులుకు పలువురు సాహితీ వేత్తలు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సంక్షేమ పథకాల పునరుద్ధరణకు కృషి


మాట్లాడుతున్న చైర్మన్ మల్లికార్జునరావు

కర్నూలు(అర్బన్): భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ పథకాలను పునరుద్ధరించేందుకు తన వంతు కృషి చేస్తానని కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు చెప్పారు. మంగళవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో భవన నిర్మాణ కార్మికులు, యూనియన్ నేతలతో సమావేశం నిర్వహించారు. పాల్గొన్న ఏపీ బిల్డింగ్, నిర్మాణ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి ఖాజా బాషా, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ. ఇతర రాష్ట్రాల్లో పథకాల అమలును పరిశీలించేందుకు కమిటీ వేసి సిఫారసులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. ఉప కార్మిక కమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ కార్మిక కమిషనర్ సాంబశివ, సీతాలక్ష్మి, సహాయ కార్మిక శాఖ అధికారులు హేమాద్రి, కేశన్న, సమీర్, నీలిమ, సంధ్య పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): మగపిల్లలతో సమానంగా ఆడపిల్లల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా మాస్ మీడియా అధికారి ప్రకాష్‌రాజు చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం 'అంతర్జాతీయ బాలికా దినోత్సవం' సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలను రక్షిద్దాం–ఆడపిల్లలను చదివిద్దాం, కిశోర బాలికల్లో పోషకాహార ప్రాముఖ్యత గురించి నినాదాలు చేశారు. అనంతరం ప్రకాష్‌రాజు మాట్లాడుతూ.. లింగ నిష్పత్తిలో అసమతుల్యత వల్ల వచ్చే నష్టాల గురించి వివరించారు. ప్రతి బాలిక ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని, ఆడపిల్లలు చదువుకుంటేనే ఆర్థిక స్వావలంభన సాధించి ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, లీగల్ కన్సల్టెంట్ సుమలత, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్త మానస, ఆశా కార్యకర్త అరుణ పాల్గొన్నారు.

జల కృషీవలుడు సుబ్బరాయుడు మృతి



కర్నూలు(అర్బన్): రాయలసీమ కరువును నివారించేందుకు తాగు, సాగు నీటి కోసం నిరంతరం పరితపించిన జలవనరుల శాఖ రిటైర్డు ఇంజనీర్ సుబ్బరాయుడు మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఏఈగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన ఆయన సీమ ప్రజలను జల కష్టాల నుంచి గట్టెక్కించాలని అనేక రూపాల్లో ప్రయత్నాలు చేశారు.డీఈఈగా పదవీ విరమణ చేశాక శేష జీవితమంతా సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసమే కృషి చేశారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా జల వివరాల కోసం సుబ్బరాయుడు పైనే ఆధారపడే వారు. సిద్దేశ్వరం, వేదవతి, గుండ్రేవుల, రాజన్న కెనాల్ తదితర తొమ్మిది ప్రాజెక్టులకు రూపకల్పన చేసి ప్రభుత్వానికి నివేదించారు. రాయలసీమలో జలాలను ఒడిసిపట్టి సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలన్నీ ఆయన ఆలోచనలో నుంచి పుట్టినవే. ఆయన మృతికి అనేక మంది ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

వీరశైవులను ఓబీసీలో చేర్చాలి

కర్నూలు(హాస్పిటల్): బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లుగా, తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీల్లో భాగంగా కేంద్రంలో వీరశైవులను ఓబీసీలుగా చేర్చాలని, శ్రీశైల దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా వీరశైవులకే ప్రాధాన్యత ఇవ్వాలని వీరశైవ ఐక్యవేదిక నాయకులు కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో వారు టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వారు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలోని అన్ని శైవ దేవాలయాల్లో పాలక మండలి సభ్యులుగా వీరశైవులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శ్రీశైల దేవస్థానం ముఖద్వారమైన కర్నూలు నగరంలో బసవ భవన్ నిర్మాణం తదితర హామీలను నెరవేర్చాలని కోరారు. వీరశైవ ఐక్యవేదిక అధ్యక్షుడు ఏజీ మల్లికార్జునప్ప, ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖరప్ప, వీరశైవ సాధికార సమితి ఎస్వీ శివరాజు, జంగమ సమాజం నాయకులు జేపీ మల్లికార్జునయ్య, జె.చంద్రశేఖరయ్య, శెట్టి వీరశేఖరప్ప తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

కర్నూలు(హాస్పిటల్): ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి సకాలంలో సీపీఆర్ చేస్తే ప్రాణం కాపాడే అవకాశం ఉందని ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం చెప్పారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనెస్తీషియా వైద్యులు, టెక్నీషియన్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జంతువులను రోడ్లపైకి వదిలితే జరిమానా

కర్నూలు టౌన్: నగరంలో పందులు, ఆవులు, గాడిదలు, గేదెలను పెంచుకుంటున్న యజమానులు వాటిని రోడ్లపైకి వదిలితే జరిమానా విధిస్తామని నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి విష్ణుమూర్తి మంగళవారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరిక చేశారు. జంతువులు ప్రధాన రహదారుల్లో, రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. తద్వా రా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. జంతువులను తమ స్థలాల్లో పెంచుకోవాలని రోడ్లపైకి వదిలితే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.